# గంగ

## — ఘండికోట బ్రహ్మాజీరావు కథ

ఉద్యోగం మండి వి మించిన తరువాత నేను, శ్రీమతి మా అబ్బాయి దగ్గిరికి వెళ్లాము. వాడికీ మధ్యనే ఉద్యోగం దొరికింది. పిమ్మట పెళ్లయింది.

5గాలు, బీహారు రాష్ట్రాల స హద్దులో ఉంది. అక్కడ నూరు సం వత్సరాల క్రితం బ్రిటీష్ వారు స్థాపించిన పెద్ద కంపెనీ ఇప్పటికీ పనిచేస్తు న్నది. పై ప వవులలో ఉండే వాళ్లకు కంపెనీ వాళ్లు కట్టించిన బంగళాలు ( రుకుతాయి. ఒకవేళ అవి ఖాళీ లేకపోతే ఇళ్లు అద్దెకు తీసుకొని వాటిని ఉ ద్యోగులకిచ్చే వారు.

మా అబ్బాయికి ఉద్యోగం చేరిన వెంటనే ఇల్లు దొరకలేదు. కొంతకాలమయ్యాక బస్తీల ఒక ప్రయివేటు ఇల్లు ఇచ్చారు. ముందు విశాలమైన ఖాళీస్థలం, చిన్న పిట్టగోడ, వీధిలో పెద్ద వరండా, రెండు పడక గదులు వంటిల్లు, భోజనాల గది, స్టోర్ రూమ్, పెరట్లో వరండా, పైన డాబా, చిన్న లోగిలి, లోపల నుంచి డాబాకు మెట్లు ... ఈ ప్రకారం అన్నివిధాలా ఆ ఇల్లు సదుపాయంగా ఉంది. వీధి ఆవరణలో నూరు వరహాల చెట్టు, మందారపు మొక్క, తులసి మొక్కలు ఉన్నాయి. ఏ రోజు పూజకు ఆ రోజు పూవే శ్రీమతికి లభించేవి

కాని, ఇంత మంచి ఇంటి కొన్ని ఇబ్బందులు తప్పలేదు. ఆ ఇల్లు బస్తీలో ఉండేమో పరి సరాలు ఏమంత బాగుండేవి కావు. చుట్టూ పాలమ్ముకునే వాళ్లే ఉన్నారు. ఇళ్ల ముందే రాటలు పాతి ఆవుల్ని గేదెల్ని కట్టేవారు. వాళ్ల వారణాసి ప్రాంతంనుండి వచ్చి, చిన్న చిన్న మట్టిగోడలు, వాటి ద దూరదూరంగా నేసిన పెంకులున్న ఇళ్లు కట్టుకొని, ఎన్నేళ్లనుంచో పాలవ్యాపారం చేసుకుంటున్నారు.

ఇంటికి కొంచెం దూరం పక్కా రోడ్డుంది. దానిని కలువుతూ ఉన్న సందులోంచి మను షులు, పశువులు రావడం పోవడం జరుగుతుంది. అక్కడ వీధిలాంతరు కూడా లేదేమో, అప్పుడప్పుడూ రాత్రి వేళ వస్తే చీకటిలో, ఇంటి ముందు పడుకున్న ఐరావతాల్లాంటి కారునలుపు గేదెల మీద పడడం జరిగేది.

మేమాయింట్లో దిగేటప్పటి వర్షాకాలం రాలేదు. దిగిన రెండు వారాల్లోనే ఋతువు మారింది. మొదటి రోజుల్లో గాలి, మెరుపులు, పిడుగులు హెచ్చుగా ఉండేవి. క్రమంగా వర్షాలు ఎడతెరిపి లేకుండా కురవడం మొదలెట్టాయి. దానా, పైనా, మాఇంటి ముందున్న సందు, పశువుల గిట్టల తొక్కిడికి బాగా తయారయి, కాలు మోవడానికి గట్టినేల దొరక్కుండా పోయింది.

వర్షాలు అంతులేకుండా కురిసేవి. పశువుల్ని కట్టిన చోట్ల నీళ్లు నిలిచి, దోమలు హెచ్చయ్యాయి. దోమలకు తెరలు కట్టుకునే వాళ్లం. అంతకన్నా పెద్ద కష్టమే వచ్చిపడింది. రాత్రి ఏ పది కొండు గంటలకో, మంచి నిద్రలో ఉన్నపుడు కరెంటు పోయేది. మీదనున్న పంకా ఆగిపోవడం ఉడకపోత మొదలయ్యేది. కిటికీ తలుపులు గాలికోసం తెరిస్తే గుంపులుగా దోమలు లోపలికొచ్చి తెరలోకి కూడా దూరిపోయేవి ఈ బాధ ఉదయం ఆరుగంటల వరకూ కొనసాగేది. రాత్రంతా నిద్రలేక, పగలు నిద్రరాక భరించలేని యాతనకు గురై ఎప్పుడు ఇల్లు విడిచిపోదామా అనిపించేది.

పరిస్థితులు ఇలా ఉంటుండగా, చంటిపిల్లను తీసుకొని మా కోడలు పుట్టింటి నుంచి వచ్చింది. మనుమరాలిని చూడడానికి ఎవరో ఆడంగులు వస్తూ, వెళ్తూ ఉండేవారు.

ఒక రోజు వర్షం తెరిపిచ్చింది. వీధి వరండాల్లో వాలుకుర్చీ వేసుకొని వారపత్రికలోని సీరియల్స్ వేరుచేస్తూ, పనికిరాని కాగితాలు పక్కని పెడుతూ కూర్చున్నాను. రాత్రంతా నిద్రలేదు. చికాకు చికాకుగా ఉంది. బస్తీలోని పాల వ్యాపారస్థుల ఆడవాళ్లు ఒకరు ఒకరూ ఆవరణ గేటు తీసుకొని లో పలికి వస్తున్నారు. తలెత్తి చూశాను. ఆవరణ గోడకు అటువైపు వరుసతీర్చి ఎనిమిది, పదేళ్ల లోపు పిల్లలు నిలబడి నా వేపు చూస్తున్నారు.

రాత్రి నిద్రలేక చికాకుగా ఉందేమో, వాళ్లందరిని చూసి కసురుకున్నాను. మధ్య మధ్య పల్లెటూరి హిందుస్తానీ ఆడంగులు లోపలికి రావడం, ఆవరణ గేటు తలుపు తెరచి ఉంచడం, చెప్తేనే గాని మూయకపోవడం, అన్నీ చికాకునే కలిగిస్తున్నాయి.

అప్పుడు ఒక్కసారిగా ఒక పడుచుపిల్ల లోనికి దూసుకొని వచ్చింది. వచ్చిన మనిషి ఇంట్లోకి పోకుండా నా ఎదుటే నిలబడింది.

"బాబూజీ!" ఆ పిల్ల నాతోనే మాట్లాడింది.

తలెత్తి ఆమెవేపు చూసి అడిగాను.

"ఎవరు నువ్వు?"

"గంగను."

"ఏ గంగవి?"

"మీకు పాలుపోసే గోపాల్ చెల్లెల్ని".

గోపాల్ గురించి నాకు అంతంత మాత్రమే తెలుసు.

గోపాల్ తండ్రి అరవైయైదేళ్ల వాడు. మనిషి పొడుగ్గా ఉంటాడు. కాయకష్టానికి అలవాటుపడ్డ వాడేమో, రెండు చేతుల్లోనూ రెండు బరువైన చేదలతో కొళాయి నుండి నీళ్లు తెస్తుంటాడు. ఆవులకు, గేదెలకు మేత పెట్టడం, పాలు తీయడం మొదలైన పనులు చేస్తుంటాడు. గోపాల్ తల్లి పొట్టిగా బొద్దుగా ఉంటుంది. ఇంటిపనులు చేయడమే కాక సందుగోడ మీద పిడకలు పెడుతుంది.

గోపాల్‌కి ఇద్దరన్నదమ్ములు. పెద్దవాడు కిరాణా దుకాణం మా ఇంటి పక్కనే పెట్టుకున్నాడు. వ్యాపారం బాగానే ఉంది.

చిన్న తమ్ముడు పాలు ఇళ్లకు పట్టుకెళ్లి కొలుస్తాడు.

గోపాల్‌కి ముగ్గురు చెల్లెళ్లు. పెద్ద చెల్లెలికి చిన్నప్పుడే పెళ్లయింది. కాని, కొంచెం గూని ఉన్న ఆమె అత్తవారింటికి పోలేదు. మేనమామకు పెళ్లాంపోతే, అతని పిల్లలను పెంచుతూ, అతనితోనే కాపురం చేస్తూ ఉండిపోయింది.

ఆఖరు చెల్లెలు పదేళ్లపిల్ల. ఆమెకు పొట్ట పెద్దది. డాక్టరుకు చూపిస్తే, అందులో ట్యూమరుందని, ఆపరేషన్‌కు అయిదువేలు కావాలన్నాడు. అంత డబ్బు లేక గోపాల్ ఆమె గురించి శ్రద్ధ తీసుకోలేదు.

మరీరెండో చెల్లెలెవరు?

ఈమను అత్తవారింటికి పంపించారని విన్నాను. పెళ్లి ఆరు నెలలయిందని కూడా తెలుసు.

అయితే ఆమె ఎప్పుడొచ్చింది?

గోపాల్ మా అబ్బాయి పనిచేసే కంపెనీలోనే చప్రాసీగా పనిచేస్తున్నాడు. రోజూ పొద్దున్న ఉద్యోగానికి పోతూ, నాకో నమస్కారం చేస్తుంటాడు. అప్పుడప్పుడు సాయంకాలాల్లో కూడా కలుస్తుంటాడు. మరెందుకు గంగ వచ్చిందని చెప్పలేదు?

"ఎప్పుడొచ్చావు?" ఆమె నడిగాను.

"రెండు రోజులయింది."

"ఏంకావాలి నీకు?"

"నాకేమీ అక్కర్లేదు. చూశారా. గోడమీద కూచున్న ఆ కోతుల్ని? వాళ్లంతా మీరు కోపపడతారేమోనని ఆవరణ గోడ దాటి లోపలికి రావడంలేదు". "వాళ్లకేం కావాలి?"

"మీరు చాలా కాగితాలు పోగుపెడుతున్నారు కదా! పాపం, వాళ్ళు పడవలు చేసుకుంటారు మీరిస్తే." తరువాత ఒకరూ ఒకరూ వచ్చి ఒక్కొక్క కాగితమే పట్టుకొని వెళ్లారు. అందరూ పదేళ్లలోని వాళ్లే. మగపిల్లలు నిక్కర్లు మాత్రం తొడుక్కున్నారు. ఆడపిల్లలు చంటి తమ్ముళ్లనే, చెల్లెళ్లనే చంకల్లో వేసుకొచ్చారు.

అలా వాళ్లతో పరిచయమయింది.

క్రమంగా భయంతగ్గి, వాళ్లు నా ఎదుట కూర్చొని బడి పుస్తకాలు తెచ్చి చదువుకునే వాళ్లు. గళ్లాట లాడుకునే వాళ్లు. ఏడుస్తున్న చంటిపిల్లలను ఓదారుస్తూ, కిరాణా దుకాణం మీద కొనుక్కొన్న బిళ్లలు, బఠాణీలు తింటూ కూర్చునే వాళ్లు. వాళ్ల ఇల్లు చిన్నవేమో, విశాలమైన వీధి వరండాలో వాళ్లకి స్వేచ్ఛగా ఆడుకోడానికి చోటు దొరికింది.

పిల్లలు ఈవిధంగా రావడంతో ఇల్లు కలకలలాడడం మొదలుపెట్టింది.

ఒక రోజు శ్రీమతి మనవరాలికి చిన్న బొంత కుట్టడానికి పాతచీరలు, పంచలు దగ్గిర పెట్టుకొని కత్తిరిస్తూ కూర్చుంది. మామూలుగా గంగ లోపలికొచ్చి శ్రీమతి దగ్గిర కొంచెంసేపు నిలబడి, అడిగింది.

"అమ్మగారూ? ఈ చిన్న పదర ఎవరికోసం కూరుస్తున్నారు?"

"మా మనవరాలికి".

గంగ నవ్వింది.

"ఎందుకు నవ్వుతున్నావ్ " శ్రీమతి అడిగింది, కత్తిరించడం ఆపి.

"మీ మనవరాలు ఎప్పుడూ ఇంత చిన్నదిగానే ఉంటుందా?"

"అమ్మాయి పెరుగుతుంది లే! అప్పుడు మరోటి కుట్టుకోవచ్చు."

"అమ్మగారూ! చిన్నప్పుడు కుట్టిన బొంత అమ్మాయికి పెళ్లయేదాకా ఉండాలి!" "ఏం విచారం? పాతచీరల్లో కుట్టిన బొంత పాతికేళ్ళదాకా వుంటుందా?" "మరేం! నా బొంత తెచ్చి చూపిస్తా."

గంగ తన బొంత తెచ్చి చూపించింది.

ఆరడుగులు పొడవు, నాలుగున్నర అడుగులు వెడల్పు, కొంచెం మందంగా ఉంది. పైన ఒక వైపు నీలం మఖ్ మల్ బట్ట. రెండో వైపు ఆకుపచ్చ పట్టుబట్టా ఉన్నాయి. కుట్టి పది హేడేళ్లయి నా ఆ బొంత ఇంకా కొత్తగా ఉంది. దానిమీద కుట్లు కూడా చాలా దగ్గిరగా, డైమను ఆకారాలలో ఉన్నాయి. మధ్య మధ్య లతలు, ఏనుగులు, హంసలు, పద్మాలు.

అందరం చాలా ఆశ్చర్యపోయాం.

"ఎలా కుట్టడం ఇంత బొంత?" మా కోడలడిగింది.

"మేమందరం ఉన్నాం కదా! కుట్టడం మేం చూసుకుంటాం. రంగుదారాలు, పట్టు కుచ్చీలు పైన కిందను వెయ్యడానికి మేలురకం బట్టతెప్పించండి."

ఆ రోజునుండీ బొంతకోసం అన్ని ప్రయత్నాలు జరిగాయి.

మా అబ్బాయికి పని హెచ్చుగా ఉండడంచేత బజారుకి పోడానికి వీలుచిక్కేదికాదు. ఆడవాళ్లు ముందు కొన్ని దారాలు తెచ్చి, వాటిని మార్చడానికి, కొత్తవాటిని కొనడానికి నన్ను బజారుకు పంపించేవారు.

బస్తీలోని ఆడవాళ్లలో అనుభవమున్న వాళ్లు, ఒకరో ఇద్దరో, రోజూ వచ్చి బొంతమీద పని చేసేవారు. పైబట్టల పోగులు తీసి వాటిలోంచి రంగులదారాలు ఏర్పడం, డిజైనులో తేడా కనిపిస్తే, కుట్టినవన్నీ విప్పడం చేస్తుండేవారు.

ఎవరు వచ్చినా రాకపోయినా గంగ మాత్రం క్రమంతప్పక వచ్చేది నవ్వుతూ. పని చేస్తున్నంత సేపు ఉత్సాహం చూపించేది. నవ్వుతూ వెళ్లిపోయేది. ఇంట్లో చనువుగా తిరిగేది.

ఒకరోజు మధ్యాహ్నం నిద్రలేచి వీధి వరండాలో కూర్చున్నాను. వేయించిన సింగాడాలు పళ్లెంనిండా తెచ్చింది. మిఠాయి కూడా పట్టుకొచ్చింది.

"ఇవన్నీ దేనికి గంగా?" శ్రీమతి అడిగింది.

"ఇవాళ నా పుట్టినరోజు అమ్మగారూ?"

"ఇవన్నీ ఎవరు చేశారు?"

"నేనే!"

అవి చాలా రుచిగా ఉన్నాయి. ఏమయితేనేం గంగ మం పనివంతురాలు.

గంగ నాకు, శ్రీమతికి దండం పెట్టింది.

శ్రీమతి రవిక గుడ్డ ఒకటి పెట్లోంచి తీసి, గంగ చేతి పెట్టి దీవించింది.

"వచ్చే ఏటికి చంటిపిల్లడి తల్లివయి రావాలి!"

గంగ నవ్వింది. ఆ నవ్వులో వెలుగులేదు. పేలవంగా, దీన



ఉందనవ్వు.

ఆ రంగురంగుల బొంతను గంగ పూర్తిచేసేనరికి రెండు నెలలు దాటాయి.

ఒక బుధవారం నాడు, బస్తీలోని ఆడవాళ్లంతా వచ్చి, పట్టె మంచం మీద ఆ బొంత పరచి, దానిమీద మా మనుమరాలిని పడుకోబెట్టి ఏవేవో పాటలు పాడారు.

అది బొంత కాదు ... రత్న కంబళమే. ఎంతో గొప్ప కళా ఖండం. పల్లెటూరి హిందుస్తానీ స్త్రీలు చాలా ఓర్పుతో సాధించిన ఘనవిజయం.

బొంత పూర్తయేసరికి దానికి రెండు వందల రూపాయలు ఖర్చయింది. అయితేనేం! దాని విలువ ఇంకా ఎన్నో రెట్లుంటుంది. సామాను విలువే నేను లెక్కవేశాను. వాళ్ల కళా కౌశలాన్ని లెక్క కట్టడం నాకు సాధ్యమా! అభిమానంతో వాళ్లు తయారు చేశారేమో దానికి విలువ నిర్ణయించగలనా?

దగ్గిర బంధువుల ఇళ్లల్లో పెళ్లిళ్లుంటే నేను, శ్రీమతి దేశం వచ్చాము.

ఆరావడం రావడం ఆరునెలల పర్యంతం విశాఖపట్నం, విజయవాడ ప్రాంతాలలో ఉండిపోయాము.

మా వాడి నుండి అప్పుడప్పుడు ఉత్తరాలు వచ్చేవి. మనుమరాలు బాగా ఊసులాడుతోంది. ఒక ఉత్తరంలో కంపెనీ ప్లాటు దొరికినట్లు వ్రాశాడు. పై అంతస్తు అది. మంచి గాలి, వెలుతురూ .. పరిశుభ్రమైన పరిసరాలు. పెడల్పు తారు రోడ్డు. క్లబ్బుకు దగ్గరలో ఉంది. ఇరవైనాలుగు గంటలూ కరెంటు, నీళ్లు ఉంటాయి. మంచి ఇరుగు, పొరుగు. మనుమరాలికి అన్న ముహూర్తం చేయవలసి ఉందని, పుట్టినరోజు కూడా దగ్గిర పడుతున్నదని, వీలయినంత త్వరగా రమ్మని మా అబ్బాయి ఉత్తరం వ్రాశాడు.

మేము కొత్త ప్లాటులో అడుగు పెట్టిన తరువాత గాని దాని సౌకర్యాలు తెలిసి రాలేదు. ఇరుగు పొరుగువారు మా అబ్బాయితో పనిచేసే ఇంజనీర్లే. వారి భార్యలు యూనివర్సిటీలలో చదివి చాలా ధారాళంగా ఇంగ్లీషు, హిందీ మాట్లాడేవారు. వాళ్ల పిల్లలు దబ్బవళ్లలా ఉంటారు. అందరూ సంస్కారమున్న వాళ్లు. సభ్యత తెలిసిన వాళ్లు.అన్నిటికన్నా ముఖ్యం ఇక్కడ దోమలు చాలా తక్కువ. క్లబ్బు దగ్గిరగా ఉండేమో, పత్రికలకు పుస్తకాలకు లోటులేదు. వారానికి రెండు సినిమాలు.

అన్నీ దివ్యంగానే ఉన్నాయి.

శ్రీమతి పూజకు పువ్వులు కావాలి. కొత్తగా కట్టిన యిళ్లేమో, మొక్కమోడి అంతగా లేవు. వచ్చిన నాలుగు రోజుల తరువాత పూలకోసం మేమున్న పాత ఇంటివేపు బస్తీకి నడిచాను.

రోడ్ దిగినట్లున్నారు. ఆవరణలో నూరు వరహాల చెట్టు కొమ్మలు కొట్టేశారు. మందార మొక్క నామ మాత్రానికే ఉంది. తులసి మొక్కలు పేరుకైనా లేవు. విశాలమైన వీధి వరండాలో ఒక్క పిల్లకాయ కూడా లేడు. ఆవరణ గేటుకి తాళం కూడా వేశారు.

ఓ క్షణం సందులో గేటు దగ్గిర నిలబడి ఇంటివేపు చూస్తుంటే గోపాల్ కూతురు నన్ను చూసి "బాబూజీ ఆయా బాబూజీ ఆయా!" అంటూ పెద్ద కేకపెట్టింది. ఎక్కడి నుంచి వచ్చారో పిల్లలు, పులుపులో మంటూ నన్ను ముట్టారు. పెద్ద పిల్లలు నన్ను కావలించుకొన్నారు. చంటి పిల్లలు ఓ క్షణం నన్ను చూసి, చేతులు చాచారు ఎత్తుకోమని.

పెద్దపిల్లలు మా ఇంటి కొచ్చినప్పుడు చంటిపిల్లల్ని నాదగ్గిర విడిచిపెట్టి ఆడుకునే వారు. అందుచేతనే వాళ్లకు నాదగ్గిర మరీ చనువు ఏర్పడి నన్ను చూడగానే చేతులందించారు. ఆ చిన్న పిల్లల అభిమానానికి నాకళ్లు చెమర్చాయి. వాళ్లంతా కొంతదూరం నాతోవచ్చి ఎన్నో ప్రశ్నలు వేశారు. మనుమరాలినీ చూడడానికి రావచ్చా అని అడిగారు. సాహెబుల యిళ్లల్లోకి వాళ్లలాంటి పిల్లలను రానిస్తారా అని ప్రశ్నించారు.

శ్రీమతి పూజకు పూవులు దొరక్కపోయినా నాహృదయం మాత్రం సౌగంధంతో నిండి పోయింది.

మనస్సు ఆ చిన్నవాళ్ల ప్రేమకు ఆనందపరవశమయినా ఏదో ముఖ్యమైన విషయం మరచిపోయినట్లయింది. జ్ఞాపకం తెచ్చుకోవాలని ప్రయత్నం చేశాను. కాని, ఇల్లు చేరుకోగానే ఎవరో అతి పిల్లను మాత్రం గడపతొక్కనిచ్చారు. దానికే గోపాల్ పొంగిపోయాడు.

ఉన్న ముగ్గురు చెల్లెళ్లలో పెద్దది తలవంపులే తెచ్చింది. ఆఖరుది అయిదువేలు ఖర్చుపెట్టి ఆపరేషను చేయిస్తేనే బతుకుతుంది. ఇక మిగిలిన రెండో చెల్లెలు కాపురం స్థిరపడితే చాలునని అతను అప్పులు చేసి ఆమెను అత్తింటికి దిగబెట్టాడు.

14 ఏగా రెండువేల కట్నం తీసుకురాకపోతే ఇంట్లోంచి తగిలేస్తామని నిక్కచ్చిగా చెప్పారు. ఆ గడువయిపోగానే పనిపాటలురావని కోడల్ని ఇంట్లోంచి గెంటేశారు. వయసులో వున్న ఆడకూతురు చేతిలో చిల్లిగవ్వయినా లేకుండా, పగటి బండిలో వారణాసిలో బయలుదేరి రాత్రికి ఇల్లు చేరుకుంది.

గంగ ఇంటికి చేరిన వారం రోజుల్లోనే గోపాల్ అత్తవారికి ఉత్తరం వ్రాశాడు. పది పదిహేను రోజుల్లో డబ్బు చూసుకొని పంపుతానన్నాడు. ఆ ప్రకారం చేస్తే గంగ పదిహేను రోజుల్లో తిరిగి వెళ్లిపోయేదే.

కాని, వెంటనే జవాబు వచ్చింది. అల్లుడికి ఏదీ ఉద్యోగం లేనందున వ్యాపారం పెడుతున్నాడని, అందుచేత ఇవ్వవలసిన రెండు వేలకు మరో మూడు వేలు జతచేసి పంపినప్పుడే పిల్లను గుమ్మం తొక్కనిస్తామని వ్రాశారు.

అందుచేత గంగ మూడు నెలలపాటు పుట్టింట్లో గడిపింది. అంటే ఆ సొమ్ము కూర్చుకోడానికి గోపాల్‌కి అంతకాలం పట్టిందన్నమాట. ఒకవిధంగా మా ఇంట్లో బొంత తయారవడానికి ఆమె ఉండిపోయిందేమో ననిపించింది.

గంగ గురించే అడుగుదామని బయలుదేరిన వాడిని, పిల్లల్ని చూడడంతో అన్నీ మరచిపోయాను. ఆమె గురించి ఆలోచిస్తూ ఉంటే అర్ధరాత్రి దాటిపోయింది.

లోకంలో చాలామంది అందమైన అమ్మాయిలున్నారు. ఎంతమందో మాటకత్తెలున్నారు. కాని, ఎవరు కూడా గంగకు సాటికారు.

"బాబూజీ! ఎందుకో ఈ మధ్య మీరు మరీ చికాకు పడిపోతున్నారు. ఈ ఇబ్బందులు తప్పనివి. దోమలగోల, కరెంటు కోత, ఉడకపోత మనమెంతో విసుక్కున్నా పోవు. ఇవే కావు, ఇటువంటివే ఎన్నో బాధలు. మీరు పెద్దవాళ్లు. మీకేం చెప్పగలను. మనం విసుక్కుంటూ ఉంటే ఈ కష్టాలన్నీ చాలా తీవ్రంగా కనిపించి వేధిస్తాయి. నవ్వుతూ, సంతోషం కలిగించే పరిస్థితులను గౌరవిస్తూ, ప్రతీ అనర్థానికి అట్టే పట్టించుకోకుండా ఉంటే, ఈ కష్టాలను సులువుగా దాటవచ్చు."

అప్పుడు నాకనిపించింది, ఇంత చిన్నతనంలోనే ఎంత గొప్ప జీవిత సత్యాన్ని ఆమె నేర్చుకుందని.

అత్తవారింట్లో ఆరు నెలల్లో పడరాని బాధలుపడి బ్రతికి బైటకొచ్చిన ఆమె అనుభవంలోని సారాంశమిది.

కొత్త ఇంటికొచ్చినా గోపాల్ తమ్ముడే పాలు పోస్తున్నాడు. ఉదయం తలుపుత డితే నేనే లేచి వెళ్లాను. ఈరోజు తమ్ముడు రాలేదు. గోపాల్ స్వయంగా వచ్చాడు. పాలు కొలిపించుకున్న తరువాత అడిగాను.

"గోపాల్! గంగ దగ్గిర నుండి ఉత్తరాలు వస్తున్నాయా?"

జవాబు చెప్పడానికి బదులు అతను బావురుమన్నాడు. ఎంతో కష్టంగా అన్నాడు.

"బాబూజీ! గంగ వెళ్లిపోయింది మనల్ని విడిచి."

ఏ మాటలు నమ్మాలో, ఏవి నమ్మకూడదో నాకు తెలియ

కుండా పోయింది. ఎన్నో సందేహాలు.

మధ్యాహ్నం మా అబ్బాయి కంపెనీ నుండి తిరిగి వచ్చిన తరువాత వివరాలు తెలిశాయి.

ఆపరేషన్ కోసం అప్పుచేసిన అయిదువేల రూపాయలు పట్టుకొని, గోపాల్ గంగను అత్తింట్లో విడిచి వచ్చాడు.

గంగ అత్తవారింటికెళ్లిన రెండు వారాల్లోనే కబురు తెలిసింది ఆమె చనిపోయిందని.

గోపాల్ లబో దిబోమంటూ వచ్చాడు. గంగ సహజంగా చచ్చిపోలేదు. అత్త, మొగుడు చంపేశారు. అదైనా దారుణంగా. . . గోనెలో దింపి కర్రలతో మోది చంపారు. . పొలాల్లో పారేశారు.

"పోలీసులు అరెస్టుచేయలేదా? అడిగాను.

"పదివేల రూపాయలు ఖర్చు పెట్టారు" అన్నాడు అబ్బాయి.

"ఎందుకు చంపారు?"

"మరో సంబంధం పాతికవేలతో కుదిరిందని"

నా మనసు పాడయింది. నా ఆలోచనలన్నీ స్తంభించిపోయాయి. గంగలేదు.

కాని, గంగ కుట్టిన బొంత సాక్ష్యంగా ఉండిపోయింది. ●



## కారునలుపు

ఆసుపత్రిలో ఆరుగురు తండ్రులు అందానికి ఆత్రుతగా ఎదురు చూస్తూకూర్చున్నారు. అంతలోనే నర్సు అప్పుడే పుట్టిన ఒక కారు నలుపు బాబును తీసుకొని వచ్చింది.

బాబును చూసిన ఒకతను "సిస్టర్ ఆ బాబు నా కొడుకు"అని నిలుచున్నాడు.

నర్స్ ఆశ్చర్యపోతూ అన్నది."బాబు ఎవరికి పుట్టింది ఇంకా చెప్పనిదే మీ కొడుకు అని ఎలా చెప్పగలరు?

"నా భార్య గురించి నాకు బాగా తెలుసు ప్రతిదీ మాడ్చి మసి చేసిగాని ఇవ్వదు" అతను జవాబు ఇచ్చాడు.

## బాగాలేదు



ఒక అమ్మాయి విచారంతో తన స్నేహితురాలితో ఇలా అన్నది. "నిన్న నా ప్రియుడు తన ఇంట్లో వారిని పరిచయం చేయడానికి తీసుకొని వెళ్ళాడు. కానీ వాళ్ళింట్లోనివారు నన్నుచూసి సంతోషించలేదు. అతని భార్య, పిల్లలు ముగ్గురూ అంతే."

స్నేహితురాలు.. "నోర్మూయ్యవే, విన డాని నాకే బాగాలేదు. ఇక వాళ్లను ఎలా చూసి సంతోషించమంటావు?"

'బివి'


"ప్రిన్సెస్" నలుపు మరియు తెలుపు ఫినాయిల్

"క్లీన్ ఇట్" డిటర్జెంట్ పౌడి, లిక్విడ్ సోప్ మరియు క్లీనింగ్ పౌడి

VIKASA WOMEN INDUSTRIAL CO-OPERATIVE SOCIETY HYD

"వికాస మహిళా పారిశ్రామిక సహకార సంఘము" హైదరాబాద్

నాణ్యమైన క్లినింగ్ పౌడి, నలుపు, తెలుపు ఫినాయిల్ లిక్విడ్ సోప్ మరియు ఇతర గృహోపకరమైన వస్తువుల తయారీదారు.

ఏజెన్సీ మరియు ఇతర వివరములకు సంప్రదించండి

రాజు ఫోన్ నెం! 60003

"మహిళా సంఘాలు, సూపర్ బజార్లు, ఫ్యాక్టరీలకు ధరలలో ప్రత్యేక రాయితీ ఇవ్వబడును"